# పిప్పి దంట్లు

"ఒంటిపూట కూడు తింటావున్నా సీతాం నేను యింతమటుకు ఎటనోగట్ట పోతావుండాంగందా, తనకు యిరోశనాలు బట్టుకుని రోజురోజుకు మనిషి అవజాన దిగజారిపోతావుందది, నే నేంజేసి చచ్చేటట్టు? కూలిదొరక్కా, కూలి దొరుకుతే గింజదొరక్కా యీవజాన అడకత్తెరోళ్ళబడి కొట్టుకుంటుండ నాబోటోడికి బగమంతుడుమటుకు కేం జేత్తాడు ?

"తిండికి కరువొచ్చిందని రేసను పెట్టారు. నిజమే - పెట్టాల్సిందే నన్నడిగితే - మరి పెట్టినాక ఆ కుసిన్నోనయినా - నాయం జరగాల్సిందేగా ? సేతిలో దమ్మిడంటే దమ్మిళ్ళేక కిందటివారం రేసను తియ్యకపోతే యీవారం అయి అవజాన సిలుగారిపోవల్సిందేనా ? నాయం సూడమన్నా. పోనీ రూల్సుందయ్యంటే రూల్సుందయ్యనుకుందాం. రేసను ఎంకయ్య ఏమన్నాడూ ? "మీకేంరా నలుగురిచేలో కూలిచేస్తేసరి, గాదెనిండా పోసుకుని ఏడాదిపొడుగూతా కాలుమీద కాలేసుకుని తినొచ్చు! మీకు కరువొచ్చిందంటే రాజాధి రాజులకు గూడా వొచ్చిందన్నమాటే!" అన్నాడు. ఆ మాట నన్నేనా అనాల్సింది? వూళ్లోవుండ నలుగురు పెద్దమనుషుల్ని పిలుసుకొచ్చి యిల్లంతా తనికీచేయించి గందా ఆమాటనాల్సింది? ఆ పెద్దమనుషులికి మటుకు తెలవదూ మనూర్లో ఎవరింటో ఎంతెంత వుందదీ? నా పెళ్ళానికి తిండి తక్కువయి ఏడిజేసి యిరోశనాలు పట్టుకుంది సానామందికి తెల్చే? రంగయ్య రూపాయికి తవ్వెణ్ణరోసొలుడు బియ్యంకాడికి పబిలిగ్గా గల్లా కొడ్తుండాడే, యీ ఎంకయ్య ఆళ్ళసంగతి ఎత్తడేం? ఎంకయ్యా? ఆడొట్ట యీన మంత్రిపని జెయ్యాల్సినోడుగాదూ ? ఆ వద్దె యిట్టాగే ఓ సోమారంనాడు సేతిలో డబ్బుసాలక అద్దరూపాయి బియ్యమే కొలిపించుకెళ్ళి, యిట్ట మూడ్రోజు నొద్దునూ, యిగనేం వుంటయ్యాడా ? ఓరి నీ యిల్లు బంగారంగాను యిదేందయ్యా అనడుగుతే "యిదొకటా పైగా! అప్పుడే తీసుకెళ్ళివిగా అన్ని ? కావాలంటే ఎవరికన్నా కార్డు చూపించుకో వాళ్ళే చెపుతారు గిత ఎక్కడిదాకా వుందో ! చస్తున్నాం యీ చదువురాని ముఠాతో !" అన్నాడే ఎంకయ్యా! ఆ గీతేందో, అదెక్కడ కొచ్చి నిలుసుద్దో నా కెట్ట తెలుసుద్దీ! మనిషి మాట నావజాన ఎత్తాతలపారేస్తే ఆటిటు సూడకుండా నెత్తిన గుడ్డేసుకుని యింటికిపోలా నేనూ ? అసలు యీ రేసనాయన్ని పేసీపడేగతేం బట్టిందంటా.

బసవయ్యగారు నాయంగల మనిషయితే, కూలీకి ముంగల దాన్యం కొలుత్తానని వొప్పందంజేసుకునీ, తీరా నాట్లయినాక మా ముగ్గుర్దీ కలిపి దగ్గిర దగ్గిర రెండు ఒత్తాల దాన్యం గింజలు ఎగ్గొట్టి, డబ్బు సేతిలో పెట్టెనుగా? రేసను కొట్లో బియ్యం సాలకా, రంగయ్యకాడికెళ్తే ఆ వుండది నీలుగారిపోయీ - సివరికి ఏం దక్కినట్టయిందీ? ఆ దాన్యంగింజలే వుంటే ఆడవి ఆవజాన మంచానపడేదా, ఇన్ని పేసీలుండేయా?'' అనుకుంటా రేషను షాపుదగ్గిర కొచ్చి తలెత్తి చూశాడు పాపయ్య.

'అబ్బో ఏ దీ జనం! కార్డుండ పెతోరూ యివాళె వొచ్చారేందబ్బా! ఏందో అరుసుకుంటున్నారే - తెలవదేం - ఏందబ్బా......' జనాన్ని తోసుకుంటూ షాపు ముందర కెళ్ళి నుంచున్నాడు పాపయ్య.

షాపు తాళంవేసి తాళం చేత్తో వెంకయ్య అక్కడ నుంచుని వున్నాడు.

"యిప్పటికి పదకొండుసార్లు చెప్పాను, మళ్ళీ పన్నెండోసారి చెపుతున్నా, బియ్యం రాలేదు" అన్నాడు వెంకయ్య.

"ఎప్పుడొత్తయ్" అన్నారు జనం.

''ఎప్పుడొచ్చేదీ నేనేం కలగన్నానా?" అన్నాడు వెంకయ్య.

"మరి మే మేంగావాలి?" అన్నారు జనం.

చేతులెత్తి జనానికి దండంపెట్టాడు వెంకయ్య

గుటకమింగుతున్న పాపయ్యను జనం అటిటు తోశారు.

* * *

పన్నెండు గంటల రాత్రయిందేమో అనుకున్నాడు పాపయ్య. "యిగ తనకు నిద్రపట్టదు. పట్టటం సాలా అనమానం. పడ్తే బాగుండు. కడుపులో ఏం లేంది నిదరపట్టేదీ లేంది తనకు బాగా గాపకంరావటంలా. మరి తన పెళ్ళామూ, కూతురూ నిదరపోతుండారే సిత్రంగావుంది? యివాల్టికి నాలుగు రోజులు కాలా రేసనుసాపు మూసి? అయిందీ... అటుమొన్నేమో, ఆ వుండ కాసిని అటుకులు తిన్నాం. మొన్నా, నిన్న పెసర గుగ్గిళ్లూ - రూపాయికి తవ్వెణ్ణర్సోలెడు పెసలా! ...అటు మొన్న శేషయ్యగారి కూలి రూపాయిపావలాబెట్టి తవ్వెడు సోలెణ్ణరగిద్దెడు పెసలుదెచ్చి, మొన్న సోలెడూ, నిన్న సోలెడూ పోతే యింకా ఎన్ని వుండయి? సోలెణ్ణరగిద్ద వుండయి. అయి రెణ్ణాళ్ళు వుంటం ఎందుకయినా మంచిదిలే. ఇవాళ గజ్జేరాకు పులుసుతాగితే కడుపంతా తొలిసినట్టయింది ఎందుకనబ్బా? కాత్తె గెట్టిగా ఏమన్నా పడకపోతే అట్టయిందా? ఏమయితే మటుకు

